## క్లుప్తంగా

### నేటితో ముగియనున్న పింఛన్ల పంపిణీ

**తెనాలిఅర్బన్:** సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం తెనాలి పట్టణంలో శుక్రవారం కొనసాగింది. పట్టణంలోని 47 సచివాలయాల పరిధిలోని ఉద్యోగులు అందుబాటులో లేని వారిని గుర్తించి వాటిని పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటలకు 97.5 శాతం పంపిణీ పూర్తి అయినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ప్రధాని మోదీ పర్యటన విధులు ఉండటం వలన శనివారం కూడా మిగిలిన పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

### జగద్గురువు ఆదిశంకరాచార్య జయంతి వేడుకలు

**తెనాలి:** స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యా పీఠంలో శ్రీసాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో శుక్రవారం జగద్గురువులు శ్రీశంకరాచార్య, శ్రీరామానుజస్వామి జయంతిని నిర్వహించారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజి) ప్రత్యేక పూజలు చేశారు. జగద్గురువులు శ్రీశంకరాచార్య, శ్రీరామానుజస్వామి విశిష్టతలను భక్తులకు తెలియజేశారు. శ్రీఆదిశంకరాచార్యులు సనాతన ధర్మం కోసం, వాటి విలువల కోసం ఎంతో కృషిచేసినట్టు చెప్పారు. హిందూ సనాతన ధర్మం వేదాలను దేశవ్యాప్తంగా కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పాదయాత్రలతో ధర్మప్రబోధం చేసినట్టు వివరించారు. జయంతి సందర్భంగా సాయంత్రం లక్ష మల్లెపూలతో పూజలు జరిపించారు. కార్యక్రమంలో నంబూరు వెంకట కృష్ణమూర్తి, రావూరి సుబ్బారావు, ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, లోకనాథం, రాజేశ్వరావు, మహిళా భక్తులు పాల్గొన్నారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

### వ్యర్థాలు తొలగించారు!



సాక్షి ఎఫెక్ట్

**తెనాలిఅర్బన్:** సాలిపేట అర్బన్ సెంటర్ ఎదుట ఉన్న వ్యర్థాలను మున్సిపల్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. వ్యర్థాలతో అవస్థలు పేరిట గురువారం ఫోటో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు వాటిని తొలగించి సున్నం చల్లించారు.

### ఏడు నుంచి తెనాలిలో తిరునాళ్లు

**తెనాలిటౌన్:** స్థానిక ఐతానగర్‌లో వేంచేసియున్న శ్రీ వెంకయ్య–గౌరమ్మ పేరాంటళ్ళమ్మ తిరునాళ్ళ మహోత్సవాలు ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు అంగరంగా వైభవంగా జరగనున్నాయి. అఖండదీపంతో ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో ప్రతి రోజు ప్రత్యేక కార్యక్రమాలతో పాటు గుమ్మిడి సిడి, జల బిందెలు, పూల కప్పెర, పసుపు బండ్లు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, మేక సిడి వంటి పలు ఆచారాలను నిర్వహిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. చివరి రోజు మొక్కలు, గంప సిడి మొక్కులతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.

### పార్టీ పటిష్టతకు పాటుపడాలి



**తాడికొండ:** నూతనంగా ఎన్నికైన నాయకులు పదవులకు వన్నె తెచ్చేలా వ్యవహరిస్తూ, పార్టీ పటిష్టతకు పాటుపడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి బాటలు వేయాలని తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) పిలుపునిచ్చారు. తాడికొండ నియోజకవర్గంలో అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియామకం అయిన పలువురు నాయకులు, కార్యకర్తలు శుక్రవారం గుంటూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన్ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకంతో పదవులు అప్పగించినందుకు అంకితభావంతో పనిచేసి పార్టీని విజయ పథంలో నడిపిస్తామని చెప్పారు.

### జీజీహెచ్‌లో పలు అభివృద్ధి పనులు ప్రారంభం నేడు

**గుంటూరు మెడికల్:** స్థానిక జీజీహెచ్‌లో శనివారం పలు అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఏపీ స్టేట్ కమిటీ వితరణతో రూ.1.60 కోట్లతో ఏర్పాటు చేస్తున్న వెంటిలేటర్‌లను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు వైద్య కళాశాల 1980 బ్యాచ్ వైద్య విద్యార్థులు ఆస్పత్రి అభివృద్ధి కోసం మంత్రి చేతుల మీదుగా రూ.9 లక్షల చెక్కు అందజేయనున్నట్లు వెల్లడించారు. అత్యాధునిక వైద్య సౌకర్యాలతో భాష్యం పేరమ్మ చారిటబుల్ ట్రస్టు, భారత్ ఫార్మా అండ్ మెడికల్ ఆక్సిజన్స్ సహకారంతో రూ.22 లక్షలతో నిర్మించిన స్టెప్‌డౌన్ ఐసీయూను ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ సభ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని వెల్లడించారు.

# ఉద్యోగాల పేరిట వల - స్థలాలు చూపి ఎర!

- ప్రభుత్వ ఉద్యోగాలు, ఇళ్ల స్థలాల పేరిట మోసాలు
- లక్షల్లో నష్టపోతున్న బాధితులు
- కేటుగాళ్ల వలలో పడొద్దంటున్న పోలీసులు

**తెనాలిరూరల్:** ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఇళ్ల స్థలాలు తక్కువ ధరకే ఇప్పిస్తామంటూ కేటుగాళ్లు వేసే వలలో పడి ఎందరో ఆర్థికంగా నష్టపోతున్నారు. కొందరైతే తాము నష్టపోయామని గ్రహించకుండా తమ బంధువులనూ ఈ కేటుగాళ్ల వలలో పడేసి వారూ నష్టపోయేందుకు కారణమవుతున్నారు. ఇటీవల కాలంలో ఇటువంటి మోసాలు ఎక్కువ అవుతున్నాయి. వీరి పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు చెబుతున్నారు.

- తెనాలి ప్రభుత్వ వైద్యశాల సమీపంలో నివసించే ఆరెమండ తేజ కృష్ణ కమల్ తాను ఏపీ సచివాలయంలో ఏఎస్‌వోగా పని చేస్తున్నానని అందరినీ నమ్మిస్తూ వచ్చాడు. అందుకోసం నకిలీ ఐడీ కార్డు, ఎంప్లాయి హెల్త్ కార్డులను తయారు చేయించాడు. వాటిని చూపి సచివాలయంలో తనకు ఉన్న పలుకుబడి ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పేవాడు. ఈ క్రమంలో వీరి ఇంటి సమీపంలోనే నివసించే విశ్రాంత ఉద్యోగి ఆళ్లముడి శివప్రసాద్ కొడుకు వెంకట మణికంఠకు హైకోర్టులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ. 3.40 లక్షలు తీసుకున్నాడు. వారికి నమ్మకం కలిగేలా ఏపీ హైకోర్టు సిటిజన్ పోర్టల్‌లో వారి ఫోన్ నంబరు రిజిస్టర్ చేయడంతో వెంకట మణికంఠ ఫోన్‌కు ఓటీపీ వెళ్లింది. హైకోర్టు నుంచి ఓటీపీ రావడంతో తమకు ఇక ఉద్యోగం వచ్చినట్టేనని భావించారు.



మోసాలకు పాల్పడిన నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు (ఫైల్)

- తెనాలికి చెందిన పాండురంగ విఠల్, గుంటూరుకు చెందిన గౌరీనాథశాస్త్రిల నుంచి వారి పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ. 12 లక్షలు తీసుకున్నాడు.
- రాజధాని ప్రాంతంలో తక్కువ ధరకు ఇంటి స్థలం వస్తుందని ఆళ్లముడి శివప్రసాద్ నుంచి రూ. 12.40 లక్షలు తీసుకుని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ నుంచి తీసుకున్నట్టు నకిలీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఇచ్చాడు.
- ఆళ్లముడి శివప్రసాద్ వియ్యంకుడు వెంకటసత్య నరసింహమూర్తి తక్కువ ధరకే స్థలం దొరుకుతుందని నమ్మి రూ. 40 లక్షలు చెల్లించాడు.
- బంగారం బిస్కెట్ తక్కువ ధరకు వస్తుందంటే శివప్రసాద్ రూ. 8.55 లక్షలు ఇచ్చి నష్టపోయాడు. పెదరావూరుకు చెందిన చొప్పర సుధాకర్ ప్రభుత్వ ఉద్యోగం కోసం రూ.1.50 లక్షలు ఇచ్చి నష్టపోయాడు.
- పట్టణ మారిస్‌పేటకు చెందిన కె.మహేష్‌బాబుకు రైల్వే వర్క్‌షాప్‌లో ఉద్యోగం ఇప్పిస్తామంటూ భార్యాభర్తలు 2024లో రూ. 4.60 లక్షలు తీసుకున్నారు. నవంబరులో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో జిల్లా పోలీసు కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు.
- పెదకాకాని మండలం అగతవరప్పాడు గ్రామినికి చెందిన ఎంబీఏ విద్యార్థి నాగరాజుకు తన సహచర విద్యార్థిని పరిచయమై హైదరాబాద్‌లో ఉగ్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ. 1.05 లక్షలు తీసుకుంది. కాలయాపన చేస్తుండంతో పోలీసులను బాధితుడు ఆశ్రయించాడు. పది రోజుల్లో మొత్తం చెల్లిస్తానని ఒప్పుకుని, చివరకు బెదిరింపులకు పాల్పడుతోంది.

ఇలా ప్రభుత్వ, ప్రైవేటు కొలువులు ఇప్పిస్తామని, తక్కువ ధరకు ఇళ్ల స్థలాలు, బంగారం ఉందని చెప్పి మోసాలకు పాల్పడే వారి బారిన పడి ఎందరో నష్టపోతున్నారు. ఇటువంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

#### ఒకటికి రెండుమార్లు సరిచూసుకోండి

ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు ఇప్పిస్తామని, తక్కువ ధరకే బంగారం, స్థలాలు ఉన్నాయని చెప్పే వారిపట్ల జాగ్రత్తగా ఉండాలి. ఒకటికి రెండు సార్లు వారి వివరాలను పరిశీలించుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగినని చెబితే ఉద్యోగం చేస్తున్నాడో లేదో విచారణ చేయాలి. ఇటువంటి వారి వలలో పడకుండా ఉండడమే మంచిది.

–ఎస్. రమేష్‌బాబు, త్రీ టౌన్ సీఐ

## తరగతులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేష్ డిమాండ్

**తెనాలిటౌన్:** వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక గాంధీనగర్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిన్నప్పటికి ప్రవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు బ్రిడ్జి కోర్సుల పేరుతో అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి అడ్మిషన్లు చేయించుకుంటున్నారని ఆరోపించారు. అధిక ఫీజులు దోచుకోవడమే పనిగా ఇంటింటికీ తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలవుల్లో ఉల్లాసంగా గడపాల్సిన విద్యార్థులు బ్రిడ్జి కోర్సుల పేరుతో పాఠశాలల్లో మగ్గుతున్నారని విమర్శించారు. జీవోనెం.77ను రద్దు చేసి అందరికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖమంత్రి నారా లోకేష్ కూటమి ప్రభుత్వం హామీలను నేరవేర్చడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. విద్యాశాఖ అధికారులు స్పందించి వేసవిలో జరుగుతున్న తరగతులను నిలుపుదల చేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జి.శివనాగరాజు, తెనాలి పట్టణ ఉపాధ్యక్షుడు భూమేష్, కోశాధికారి తేజ, సహాయ కార్యదర్శి దినేష్, నాయకులు అఖిల్, పండు, హేమంత్, సాయి, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న పి.వెంకటేష్

### 'రోటరీ'చే వీల్‌చైర్ల పంపిణీ

**తెనాలి:** రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక అవసరాలు కలిగిన తొమ్మిదిమంది పిల్లలకు వీల్‌చైర్లను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్, రోటరీ క్లబ్ పిడుగురాళ్ల లైం సిటీ సహకారంతో ఈ వితరణ చేశారు. రోటరీ, తెనాలి అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, రొటేరియన్లు పావులూరి రాంబాబు, కన్నెగంటి మురళీకృష్ణ, గుత్తా వెంకటరత్నం, కొత్తపల్లి సుబ్బారావు, కొల్లి రాజేంద్రప్రసాద్, ఈదర ఆనంద్, కుర్రా శ్రీనివాసరావు, జీవీ నారాయణ, కేవీ కృష్ణ, ఎస్.కిషోర్, జవ్వాజి శ్రీనివాసరావు, వీరవల్లి శ్రీధర్, ఆలపాటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



### ఉమ్మడి కుటుంబాలతోనే
# ప్రయోజనమన్న నాటికలు

**తెనాలి:** రూరల్ మండల గ్రామం కొలకలూరులో కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త నిర్వహణలో శుక్రవారం రాత్రి ఆరంభమైన ఉభయ రాష్ట్రస్థాయి 11వ ఆహ్వాన నాటికల పోటీలు సందేశాత్మకంగా సాగాయి. తొలుత ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి 'కిడ్నాప్' నాటికను ప్రదర్శించారు. కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని తెలియజెప్పిందీ నాటిక. స్వార్థజీవనానికి అలవాటు పడుతున్న యువత తల్లిదండ్రులను దూరంగా ఉంచుతున్న తీరును కళ్లకు కట్టారు. వందలకొద్దీ పుస్తకాలు చదివితే వచ్చే విజ్ఞానం, మన ఇళ్లలోని పెద్దవాళ్లు చెప్పే మాటలతోనే వస్తుందని పాత్రలతో చెప్పించారు. ప్రధాన పాత్రల్లో చెరుకూరి సాంబశివరావు, అమృతవర్షిణి, షేక్ హసన్, ఎస్.పూజిత, నడింపల్లి వెంకటేశ్వరరావు, లోకేష్ నటించారు. చెరుకూరి సాంబశివరావు రచించిన ఈ నాటిక ప్రదర్శనకు ఆయనే దర్శకత్వం వహించారు. రెండో ప్రదర్శనగా కళానికేతన్, వీరన్నపాలెం వారి 'రుతువు లేని కాలం' నాటికను ప్రదర్శించారు. అగస్త్య రచించిన నాటికకు వైబీ చౌదరి దర్శకత్వం వహించారు. సమిష్టి కుటుంబాలపై చదువుకుని, ఉద్యోగాలు చేస్తున్న మహిళల్లో ద్వేషాన్ని చర్చించిందీ నాటిక. సోకులకీ, ఫ్యాషన్లకీ లొంగిపోయి, వాళ్లకి వాళ్లే బానిసలుగా మిగిలిపోతున్నారు. వార్ధక్యం పేరుతో పెద్దవాళ్లని దూరంగా ఉంచుతున్నారు. అలాంటి జీవితాలను ఎంచుకోవటం ఎలా సబబు? వాళ్లకు మనుష్యుల మధ్య బంధాల విలువ ఎలా తెలుస్తుందనే అంశాన్ని ఉదాత్తంగా ప్రశ్నించిందీ నాటిక. కాలం రుతువుల్లో భద్రంగా ఉన్నట్టే మనిషి బంధాల మధ్య హాయిగా, రక్షణగా ఉంటుందనే సందేశాన్నిచ్చింది. ప్రధాన పాత్రల్లో వై.బుచ్చయ్య చౌదరి, కె.వీరయ్య, జి.సురేంద్రబాబు, సునయన, రత్నబాబు, సురభి ప్రభావతి, కె.శ్రీనివాసరావు తదితరులు నటించారు. చివరగా గురజాడ కళామందిర్ వారి 'మహాప్రస్థానం' నాటికను ప్రదర్శించారు. పేదరికాన్ని అధిగమించాలనే ఆలోచనతో అవగాహన లేని ప్రయాణం ప్రస్థానమై, మహాప్రస్థానమై చావుకి, ప్రయాణానికీ మధ్య గీతను చెరిపేస్తుందనే సత్యాన్ని చాటిందీ నాటిక. బొర్ర సరేష్, ఎల్ఎస్‌కేఆర్‌కే ప్రసాద్, ఈవన రమేష్‌బాబు, పిల్లా నటరాజ్, ఆర్.రాజేశ్వరి నటించారు. ఎం.సంజీవి రచించిన నాటికను పిల్లా నటరాజ్ దర్శకత్వంలో ప్రదర్శించారు.



'కిడ్నాప్' నాటికలో సన్నివేశం

# బస్సులు ఫుల్... జనం నిల్

- డ్వాక్రా మహిళతో సరిపెట్టిన అధికారులు
- అక్కడక్కడా వెలవెలబోయిన బస్సులు
- అమరావతి వెళ్లింది 10 వేల లోపే!
- అవస్థలు పడిన ప్రయాణికులు

**తెనాలిఅర్బన్:** బస్సులు ఫుల్...జనం నిల్ అన్న చందానా అమరావతికి తరలింపు ప్రక్రియ జరిగింది. తెనాలి నియోజకవర్గం నుంచి 302 బస్సులలో 15 వేల మందిని తరలించాలని అధికారులు, టీడీపీ, జనసేన నాయకులు భావించినప్పటికీ ఆశించిన స్థాయిలో జరగలేదు. చేసేది లేక డ్వాక్రా మహిళలు, గ్రామ స్వీపర్‌లు, అంగన్‌వాడీలతో సరిపెట్టారు. దీంతో ఎక్కువ శాతం బస్సులలోని సీట్లు ఖాళీగా కనిపించాయి.

అమరావతి రాజధాని పనుల పునఃనిర్మాణ పనులను శుక్రవారం ప్రధాని మోదీ ప్రారంభించనున్న నేపథ్యంలో తెనాలి నియోజవర్గం నుంచి జనసమీకరణ జరపాలని పాలకులు, ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో తెనాలి పట్టణంలో మెప్మా అధికారులకు కొల్లిపర, తెనాలి మండల బాధ్యతలను డీఆర్‌డీఏ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్‌లకు అప్పగించారు. దీంతో వీరు వారం రోజుల నుంచి డ్వాక్రా సంఘ సభ్యులు, ఆర్‌పీలు, కమ్యూనిటీ ఆఫీసర్‌లు, సీసీలు, యానిమేటర్‌లతో అంతర్గత సమావేశాలు నిర్వహించారు. ప్రతి గ్రూప్ నుంచి కనీసం అయిదుగురు రావాలంటూ హుకుం జారీ చేశారు. ప్రధాని సభకు రాని వారికి రుణాలు నిలిపివేస్తామని హెచ్చరించారు. దీంతో సభ్యులు అమరావతి వెళ్ళేందుకు సుముఖత చూపారు.

**బస్సుల్లో సీట్లన్నీ ఖాళీ!**

జన సమీకరణ కోసం తెనాలి పట్టణం, కొల్లిపర, తెనాలి మండల పరిధిలో 302 బస్సులు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి తెనాలి వచ్చిన బస్సులను మార్కెట్ యార్డు ఆవరణలో ఉంచారు. శుక్రవారం ఉదయం వాటిని ఆయా వార్డులు, గ్రామాలకు అధికారులు పంపి డ్వాక్రా సంఘ ఆర్‌పీలు, యానిమేటర్‌లకు సమాచారం అందించారు. బస్సుకు 50 మంది చొప్పున తెనాలి నియోజకవర్గం నుంచి 15వేల మందిని తరలించాలని భావించారు. కానీ సభ్యుల నుంచి స్పందన కొంత తక్కువగా ఉండటంతో పట్టణంలో కేవలం 20 నుంచి 30 మందిని మాత్రమే బస్సులలో ఎక్కించగలిగారు. అదే కొన్ని గ్రామాలలో రాజధాని వెళ్ళేందుకు ఎవరు ముందుకు రాకపోవటంతో స్వీపర్లు, అంగన్‌వాడీలు, అరకొరగా డ్వాక్రా సంఘ సభ్యులను వాటిలో ఎక్కించి మమ అనిపించారు. తెనాలి మండలం కఠెవరం గ్రామానికి 8 బస్సులు పంపారు. ఎవరు ఎక్కకపోవటంతో రెండు బస్సులు డిపోకు వెళ్ళిపోయాయి. అలాగే రాజోల్ డిపోకు చెందిన రెండు బస్సులు మొరాయించటంతో అవి డిపోకు పరిమితం కావాల్సి వచ్చింది. దీనిని బట్టి చూస్తే తెనాలి నియోజవర్గం నుంచి 10 వేల మంది కూడ వెళ్లలేదనే విషయం అర్థమౌతుంది.

**డ్వాక్రా సంఘ సభ్యులే దిక్కు.**

తెనాలి నియోజవర్గంలోని టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో వస్తారనే ఆలోచనతో పాలకులు వారికి 188 బస్సులు కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. అయితే కూటమి పార్టీలలోని ప్రధాన నాయకులు మినహా మిగిలిన వారు రాజధాని వెళ్ళేందుకు వెనుకంజ వేశారు.

**అవస్థలు పడిన ప్రయాణికులు**

ప్రధాని మోదీ సభకు తెనాలి ఆర్టీసీ డిపోలోని దాదాపు అన్ని బస్సులు కేటాయించటంతో అది వెలవెలపోయింది. విజయవాడ, గుంటూరుకు ఊడతాభక్తిగా కొన్ని సర్వీసులు ఏర్పాటు చేశారు. మిగిలిన అన్ని గ్రామాల సర్వీసులను అధికారులు రద్దు చేశారు.




నిర్మానుష్యంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్



జనంతో పూర్తిగా నిండని బస్సులు



బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



బస్సుల రద్దు వివరాలు తెలియజేసే బోర్డు



మొరాయించిన రాజోలు డిపో బస్సు

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యాలు చేస్తున్న బాలబాలికలు



కోలాటం నిర్వహిస్తున్న మహిళలు

**తాడేపల్లి రూరల్:** సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేడే ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. తాడేపల్లి సుందరయ్య నగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బత్తుల రాజు భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్థానిక ప్రగతి బాలవిద్యాలయం బాలబాలికలు నాగులమ్మ నాగులమ్మ పలుగురాళ్ల ఎర్రజెండా పాటకు నృత్యం చేశారు. మహిళలు ప్రదర్శించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వి. కృష్ణయ్య, నాయకులు వెంకటరావు, రాఘవయ్య, భుజంగరావు, శేఖర్, గిరిజ, బాషా, సత్యం, జ్యోతి, భ్రమరాంబ, అంజలి, శ్రీలక్ష్మి, అరుణ, చందు, రవీంద్ర, శివ పాల్గొన్నారు.

## ముగిసిన విరామ బైబిల్ తరగతులు

**మంగళగిరి టౌన్:** మంగళగిరి నగర పరిధిలోని ఇమ్మానియేల్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విరామ బైబిల్ పాఠశాల తరగతులు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా పాస్టర్ రవిప్రకాష్ మాట్లాడుతూ ఏప్రిల్ 24 నుంచి విరామ బైబిల్ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. పాల్గొన్న చిన్నారులకు బైబిల్‌లోని అంశాలతో పాటు ఆటపాటలు, గేమ్స్, డ్రాయింగ్, పప్పెట్ షో, మ్యాజిక్ షో వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. బాలుడు నడవాల్సిన త్రోవను వారికి నేర్పించాలని, చిన్నబిడ్డల్లాంటి హృదయం కలవారిదే పరలోక రాజ్యం అని పేర్కొన్నారు. అనంతరం పిల్లలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రాణి, ఆలివ్ రిచర్డ్స్, మేరీ ఫ్లోరెన్స్, శ్వేత, న్యూటన్, హెప్సిబా పాల్గొన్నారు.



బహుమతులతో చిన్నారులు

## మోదీ అమరావతికి ఏమిచ్చారు ?

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలకా విజయ్ కుమార్

**తాడికొండ:** ప్రధాన మంత్రి మోదీ అమరావతి పునఃనిర్మాణ పనుల కోసం వచ్చి ఏమిచ్చారని గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలకా విజయ్ కుమార్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రశ్నించారు. రాష్ట్రంలో బలమైన నాయకత్వం లేనన్నాళ్లు మోదీ గారడీలు చేస్తుంటారని తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం ఏమీ చేయదని, ఈ విషయాన్ని ముందే పసిగట్టి ఏపీసీసీ చీఫ్ షర్మిల అమరావతి సందర్శనార్థం వస్తుంటే అన్యాయంగా నిర్బంధించారని విమర్శించారు. డబ్బులివ్వకపోయినా అమరావతికి చట్టబద్ధత అయినా కల్పిస్తారని ప్రజలు భావించారని, కానీ ప్రధాని ప్రసంగంలో కనీసం దానికి కూడా దిక్కులేదని పేర్కొన్నారు. సభ ఆద్యంతం ఒకరి నొకరు పొగుడుకోవడానికి తప్పా దేనికి ఉపయోగం లేదని చిలకా విజయ్ విమర్శించారు. ఇకనైనా బాబు, పవన్‌లు కళ్లు తెరవకపోతే గత ప్రభుత్వంలో అమరావతి రైతులకు వెల్లువెత్తిన సమస్యలు మళ్లీ పునరావృతం అయ్యే అవకాశం లేకపోలేదని తెలిపారు. కేంద్రంతో పోట్లాడయినా అమరావతికి చట్టబద్ధత కల్పించేలా చూడాల్సిన బాధ్యత చంద్రబాబు, పవన్‌లపై ఉందని ఆయన తెలిపారు.

### కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

**తాడేపల్లి రూరల్:** ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యపై ప్రభుత్వం స్పందించాలని యూనియన్ నాయకుడు కూరపాటి స్టీవెన్ కోరారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో శుక్రవారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని ఆయన నాయకులు కె. ఆదినారాయణ, బి. అంకయ్య, నాగేశ్వరరావులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 150 రోజుల నుంచి కార్మికులు న్యాయంగా తమకు రావాల్సిన నష్టపరిహారం కోసం దీక్షలు చేస్తున్నారని, అయినా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని తెలిపారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ ఈ ప్రాంతంలో పర్యటించినపుడు తాము అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆయన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, ఇమాంబి, రమణ, గురవయ్య, సుబ్బారావు, శారమ్మ, దుర్గాభవాని, రమాదేవి, రహీంతుల్లా పాల్గొన్నారు.

### పీఎంజేఏవై 75 శాతం పూర్తి

**ఫిరంగిపురం:** మండలంలోని 18 గ్రామాల్లో గత 20 రోజులుగా ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న పీఎంజేఏవై (ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన) సర్వే 75 శాతం పూర్తయినట్లు సుదురుపాడు, ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు శుక్రవారం తెలిపారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యస్థితి గతులు, 70 ఏళ్లు ఉన్నవారి వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. పీఎంజేఏవై కార్డు ద్వారా దేశంలోని ఏ ప్రాంతంలో ఉన్న వైద్యశాలలో చికిత్స చేయించుకునేందుకు రూ. 5లక్షల వరకు సాయం అందుతుందని వారు వివరించారు.

### నిర్దేశిత లక్ష్యంతోనే విజయ సాధన

**తాడేపల్లి రూరల్:** నిర్దేశిత లక్ష్యంతోనే విజయం సాధించవచ్చని విద్యార్థి వికాసవాహిని సభ్యులు వి. కేశవరావు అన్నారు. తాడేపల్లి బైపాస్ రోడ్డులోని అమరావతి ఐకాన్‌లో శుక్రవారం మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం పాటు అమరావతి ఐకాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణకు కేశవరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా లక్ష్యాన్ని ఏర్పరచుకుని ముందుకు వెళ్లినప్పుడే విజయం సాధించవచ్చని తెలిపారు. పాఠ్య పుస్తకాలతో పాటు వార్తా పత్రికలు చదవడం ద్వారా మరింత విజ్ఞానం పొందవచ్చని విద్యార్థులకు సూచించారు. ఎంటీఎంసీ బాలోత్సవం కోశాధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా మరిన్ని విషయాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

### కృష్ణనగర్‌లో ఓ మహిళ ఆత్మహత్య

**లక్ష్మీపురం:** వేధింపులు భరించలేక ఓ వివాహిత అపార్ట్‌మెంట్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన కృష్ణానగర్ జీరో లైన్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన ముప్పల మల్లికార్జునరావు అకౌంటెంట్‌గా పని చేస్తుంటాడు. ఆయనకు ఇద్దరు మగ, ఆడ సంతానం ఉన్నారు. కుమార్తె మేఘనా(24)ను అద్దంకి ప్రాంతానికి చెందిన కొత్తమాసు మణిక్రాంత్ అనే యువకుడికి ఇచ్చి 2023 ఫిబ్రవరి 12వ తేదీన పెళ్లి చేశారు. వీరికి ఏడాది పాప ఉంది. అయితే వివాహం అయినప్పటి నుంచి మేఘనా, భర్త మణిక్రాంత్‌ల మనస్పర్థలు పెరిగిపోయాయి. మేఘనాను నిత్యం కట్నం తీసుకు రావాలంటూ వేధింపులకు గురి చేయడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో భర్తను వదిలేసి సుమారు నెల రోజుల క్రితం గుంటూరు కృష్ణనగర్‌లోని పుట్టింటికి వచ్చి ఉంటుంది. అయితే గురువారం కాపురం గురించి పెద్దల సమక్షంలో ఇరు కుటుంబాలు మాట్లాడుకునే క్రమంలో ఇద్దరి మధ్య చిన్నపాటి వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో మేఘనా మనస్థాపానికి గురై శుక్రవారం కృష్ణానగర్ జీరో లైన్‌లో ఉన్న హరి టవర్స్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుని అక్కడిక్కడే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న పట్టాభిపురం ఎస్ఐ తరంగిణి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. భర్త మణిక్రాంత్‌ను పట్టాభిపురం పోలీసులు అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు.